క్లుప్తంగా

వరి రైతులు జాగ్రత్తలు తీసుకోవాలి

అనకాపల్లిటౌన్: మిచాంగ్ తుపాను కారణంగా వరి పంట నష్టపోకుండా తగు చర్యలు తీసుకోవాలని ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం ఏడీఆర్ పీవీకే జగన్నాథరావు తెలిపారు. స్థానిక ఆర్ఏఆర్ఎస్‌లోని తమ కార్యాలయంలో మంగళవారం శాస్త్రవేత్తలతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పొలాల్లో నిలిచిన వర్షపు నీటిని తొలగించి, పనలు తడిచి ఉంటే గింజ రంగు మారకుండా, మొలకెత్తకుండా ఉండేందుకు లీటరు నీటిలో 5 గ్రాముల ఉప్పు కలిపి పిచికారీ చేయాలన్నారు. ఎకరాకు 20 కిలోల ఉప్పును సరిపడా నీటిలో పిచికారీ చేసి పనలపై జల్లుకోవాలన్నారు. విత్తనం కొరకు జనుము జల్లుకున్నట్‌లెతై లాభదాయకంగా ఉంటుందన్నారు. విత్తనాలు కావలసిన రైతులు కిలో రూ.70 చొప్పున స్థానిక కార్యాలయంలో కొనుగోలు చేయవచ్చన్నారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు సీహెచ్ ముకుందరావు, ఎంబీజీఎస్ కుమారి, ఆదిలక్ష్మి, విశాలాక్షి, శిరీష, చంద్రశేఖర్, అలివేణి పాల్గొన్నారు.

తిమ్మరాజుపేటలో వై ఏపీ నీడ్స్ జగన్



తిమ్మరాజుపేటలో వైఎస్సార్‌సీపీ జెండాను ఆవిష్కరిస్తున్న దృశ్యం

అచ్యుతాపురం(అనకాపల్లి): అచ్యుతాపురం మండలంలోని తిమ్మరాజుపేట గ్రామంలో మంగళవారం వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో వైఎస్సార్‌సీపీ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో మండల పార్టీ నాయకులు దేశంశెట్టి శంకరరావు, కోన బుజ్జి, జగ్గారావు పాల్గొన్నారు.

ఒంపోలులో నేడు 'వై ఏపీ నీడ్స్ జగన్'

మునగపాక : మండలంలోని ఒంపోలులో బుధవారం వై ఏపీ నీడ్స్ కార్యక్రమం జరుగుతుందని ఎంపీడీవో ఎం.మన్మథరావు ఒక ప్రకటనలో తెలిపారు. మధ్యాహ్నం 3గంటలకు సచివాలయ ప్రాంగణంలో ప్రభుత్వ పథకాల లబ్ధికి సంబంధించిన ఫ్లెక్సీల ఆవిష్కరణతో పాటు ప్రజలకు అవగాహన కార్యక్రమం జరుగుతుందన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

వలంటీర్ సేవాభావం



కేజీహెచ్‌లో అప్పారావుతో వేలిముద్ర వేయిస్తున్న వలంటీర్ తమ్మంగి బుజ్జిబాబు

యలమంచిలి (అనకాపల్లి రూరల్): దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతూ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వ్యక్తి వద్దకే వెళ్లి పింఛను అందజేసి తన సేవాభావాన్ని చాటుకున్నాడొక వలంటీర్. పురుషోత్తపురం గ్రామానికి చెందిన నందిక అప్పారావు ఇటీవల పక్షవాతానికి గురయ్యాడు. 15 రోజులుగా అప్పారావు విశాఖలోని కేజీహెచ్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. అతను ఈ నెల పింఛను అందుకోలేకపోవడంతో గ్రామ వలంటీర్ తమ్మంగి బుజ్జిబాబు తన సొంత ఖర్చులతో మంగళవారం విశాఖ కేజీహెచ్‌కు వెళ్లి చికిత్స పొందుతున్న అప్పారావు నుంచి వేలిముద్ర సేకరించి అక్కడే పింఛన్ సొమ్ము అందజేశాడు. వలంటీర్ సేవాగుణాన్ని వైస్ ఎంపీపీ రాజాన శేషు, సర్పంచ్ రాజాన సునీత ప్రశంసించారు.

కళా ఉత్సవ్‌కు ఆరిపాక విద్యార్థులు

సబ్బవరం: ఈ నెల 11, 12 తేదీల్లో భీమిలి డైట్ కళాశాలలో జరగనున్న కళాఉత్సవ్‌లో మండలంలోని ఆరిపాక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన 20 మంది విద్యార్థులు పాల్గొంటారని పాఠశాల ఆంగ్ల ఉపాధ్యాయురాలు బీవీ రామలక్ష్మి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. వీరిలో 10 మంది బాలురు, 10 మంది బాలికలు ఉన్నారన్నారు. శాస్త్రీయ సంగీతం, జానపద సంగీతం, వివిధ వాయిద్యాలు వాయించడం, శాస్త్రీయ నృత్యం, చిత్రలేఖనం, 2డీ, 3డీ బొమ్మల తయారీ అంశాలమీద పోటీలు నిర్వహిస్తున్నారు. పోటీలో మొదటి స్థానంలో నిలిచినవారు ఈ నెల 14, 15 తేదీల్లో విజయవాడలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. విజేతలకు నగదు, మెడల్‌తో పాటు అవార్డులు ఇస్తారని ఆమె తెలిపారు.



నక్కపల్లి : కోసిన వరి పనల్లోకి చేరిన వర్షపునీరు



నక్కపల్లి : రైతులకు గ్రామాల్లో సూచనలు ఇస్తున్న వ్యవసాయ శాఖ అధికారులు



నక్కపల్లి : మూలపరలో సిబ్బందికి సూచనలు ఇస్తున్న తహసీల్దార్, ఎంపీడీవోలు



జల్లూరులో నీట మునిగిన వరి పంటను పరిశీలిస్తున్న తహసీల్దారు జానకమ్మ

మిచాంగ్ బీభత్సం...

కుండపోత వర్షం

- వరిపొలాల్లోకి వర్షపునీరు
- గ్రామాల్లో పర్యటిస్తున్న అధికారులు
- ముమ్మరంగా సహాయక చర్యలు

నక్కపల్లి : మిచాంగ్ తుపాను ప్రభావం కారణంగా మంగళవారం ఉదయం నుంచి వర్షం కుండపోతగా పడుతూనే ఉంది. ఎడతెరపి లేకుండా రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. వరి పొలాల్లోకి పెద్ద ఎత్తున వర్షపునీరు వచ్చి చేరుతోంది. కోసిన వరిపనలు వర్షపు నీటిలో తడిసిపాడవుతున్నాయంటూ రైతులు ఆవేదన చెందుతున్నారు. గొడిచర్ల, గుల్లిపాడు, రమణయ్యపేట, ముకుందరాజుపేట, కాగిత, రేబాక తదితర గ్రామాల్లో వరిపంట పక్వానికి వచ్చింది. అక్కడక్కడ రైతులు వరిపైరును కోసి పొలాల్లో ఎండబెట్టారు.ఈలోగా తుఫాను కారణంగా పడుతున్న వర్షానికి వరిపనలు తడిసిపోతున్నాయని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అయితే ప్రభుత్వ ఆదేశాల మేరకు వ్యవసాయ శాఖ సిబ్బంది గ్రామాల్లో పర్యటిస్తున్నారు. మండల వ్యవసాయాధికారి ఉమాప్రసాద్, ఏఈవో సత్యనారాయణ ఆధ్వర్యంలో సిబ్బంది గ్రామాల్లో పర్యటించి రైతులకు ధైర్యం చెబుతున్నారు. ఈ సందర్భంగా ఏవో ఉమా ప్రసాద్ మాట్లాడుతూ నక్కపల్లి మండలంలో సుమారు 750 ఎకరాల్లో వరిపంట కోత దశలో ఉందన్నారు. మూడు రోజుల నుంచి 115 మిల్లీమీటర్ల వర్షం నమోదయిందన్నారు. ప్రాథమిక అంచనా ప్రకారం ఇప్పటివరకు 105 ఎకరాలో వరికోతలు పూర్తయ్యాయని, వీటిలో 25 ఎకరాల్లో వరిపనలు వర్షాలకు తడిసిపోయాయన్నారు. కోతకోయని పంటలో సుమారు 250 ఎకరాల్లో వర్షపు నీరు చేరిందన్నారు. కోత కోసి తడిసిపోయిన పనలను కుప్ప వేస్తున్నపుడు మొలకెత్తకుండా ఎకరానికి 25 కిలోల ఉప్పు జల్లుకోవాలన్నారు. పొలంలో పనల మీద ఉన్న మొలకెత్తకుండా 5శాతం ఉప్పు ద్రావణాన్ని పిచికారీ చేయాలన్నారు. ఆర్‌బీకేల్లో సిబ్బంది అందుబాటులో ఉంటూ రైతులకు సలహాలు ఇస్తారన్నారు.

మత్స్యకార గ్రామాల్లో రెవెన్యూ అధికారులు పర్యటన

తుపాను ప్రభావంపై అమలాపురం, మూలపర, రాజయ్యపేట, బోయపాడు గ్రామాల్లో తహసీల్దార్ అంబేద్కర్, ఎంపీడీవో శ్రీనివాసరావు పర్యటించి సచివాలయ సిబ్బందిని అప్రమత్తం చేశారు. తుపాను రక్షిత భవనాలను సిద్ధం చేయాలని అవసరమైన బాధితులకు ఆహార సదుపాయాలు ఏర్పాటు చేయాలన్నారు. వీఆర్వోలు, కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది గ్రామాల్లోనే అందుబాటులో ఉండాలన్నారు. మత్స్యకారులను వేటకు వెళ్లొద్దని, తీరప్రాంతానికి దగ్గరగా ఉన్నవారు సురక్షిత ప్రాంతాలకు రావాలని సూచనలు చేశారు.

వరి చేలు నేలపాలు

ఎస్.రాయవరం: తుపానను వర్షాలకు మండలంలో 750 ఎకరాల్లో వరి పంట నేలకొరిగినట్టు అంచనా వేస్తున్నారు. ఎగువ ప్రాంతాల్లో కురిసిన వర్షానికి వరహానది నుంచి కాలువల ద్వారా నీరు పొలాల్లోకి చేరడంతో పంట దెబ్బతిందని వ్యవసాయాధికారులు చెబుతున్నారు. దార్లపూడి, చినగుమ్ములూరు, పెదగుమ్ములూరు, తిమ్మాపురం, పి.ధర్మవరం,పెనుగొల్లు,సోమిదేవపల్లి తదితర గ్రామాల్లో పొలాల్లో నీరు చేరింది. పంట పూర్తిగా నేలకొరగడంతో ఎక్కువ నష్టం ఉంటుందని గింజలు నేల రాలిపోతాయని రైతులు ఆవేదన చెందుతున్నారు.

తుపాకుల గెడ్డ ఉధృతి

కోటవురట్ల : మిచాంగ్ ప్రభావంతో మంగళవారం తెల్లవారు జాము నుంచి కుండపోతగా వర్షం కురుస్తోంది. దీని ప్రభావంతో పంట కాలువలు పొంగి ప్రవహిస్తున్నాయి. రహదారులు జలమయమయ్యాయి. కోటవురట్లలోని తుపాకుల గెడ్డ పొంగి ప్రవహించడంతో సినిమాహాలు రోడ్డులోని పలువురు గెడ్డకు ఆవలకు వెళ్లలేక ఇబ్బంది పడ్డారు. కైలాసపట్నంలో గోవాడ గెడ్డ పొంగి ప్రవహించడంతో దీని కింద వున్న 40 ఎకరాలలో వరిచేలు నీట మునిగాయి. ఈదురు గాలులకు వరి చేలు నేలకొరిగిపోయాయి. మండలంలో సుమారు 300 ఎకరాలలోని వరి చేలు పాక్షికంగా దెబ్బతిన్నట్టు రైతులు అంచనా వేస్తున్నారు.

నీట మునిగిన వరి చేలు పరిశీలించిన అధికారులు

కోటవురట్ల : మండలంలో తహసీల్దారు జానకమ్మతో పాటు వ్యవసాయాధికారి బి.సరోజిని పర్యటించి పంటల పరిస్థితి తెలుసుకున్నారు. నీట మునిగిన వరి చేలను పరిశీలించి రైతులకు సూచనలు ఇచ్చారు.

జల్లూరు, లింగాపురం, కైలాసపట్నం ప్రాంతాల్లో ఎక్కువగా వరి చేలు నీట మునిగినట్టు గుర్తించామని తహసీల్దారు తెలిపారు. వరి చేలల్లో నీరు నిలిచిపోతే పాయలుగా విడదీసి నీరు బయటకు పోయేలా చర్యలు తీసుకోవాలని, నీరు బయటకు తీసిన వెంటనే మూడేసి దుబ్బులను కట్టి నేలవాలకుండా చూడాలని వ్యవసాయధికారి సరోజిని రైతులకు తెలిపారు. వరి పనలు నీట మునిగితే 50 గ్రాముల ఉప్పును లీటరు నీటిలో కలిపి పనలు తడిసేలా పిచికారీ చేయాలన్నారు.

లోతట్టు ప్రాంతాలను పరిశీలించిన అధికారులు

పాయకరావుపేట : తుపాను ప్రభావానికి గురైన మండలంలో గల తీర ప్రాంత గ్రామాలను, తాండవ నదీ పరీవాహక ప్రాంతాలను పరిశీలించారు. మండలంలో గల సత్యవరం, మాసాహెబుపేట గ్రామాల వద్ద నున్న తాండవనది పల్లపు ప్రాంతాలను, రాజానగరం, రాజవరం తీర ప్రాంత పల్లపు ప్రాంతాలను పరిశీలించారు. పల్లపు ప్రాంత నివాసితులకు సూచనలు, సలహాలు అందించారు. సీఐ పి.అప్పలరాజు, డీటీ కె.నూకరాజు, నీటి పారుదలశాఖ అధికారులు పరిశీలించారు.

వైఎస్సార్‌సీపీ నాయకుల సహాయక చర్యలు

మునగపాక: మండలంలోని తిమ్మరాజుపేటలో రెండు రోజులుగా తుపాను కారణంగా పడుతున్న వర్షాలకు పలు చోట్ల వర్షపునీరు నిలిచిపోయింది. దీంతో ప్రజలు ఇబ్బందులు గుర్తించిన వైఎస్సార్‌సీపీ నేతలు సమస్య పరిష్కారానికి ముందుకొచ్చారు. తిమ్మరాజుపేట ఉప సర్పంచ్, వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ విభాగం అధ్యక్షులు కాండ్రేగుల జగన్, సచివాలయ కన్వీనర్ రామభద్రరావు చొరవ చూపి మంగళవారం రాత్రి కాలువల ద్వారా వర్షపు నీరు పోయేలా పిచ్చి మొక్కల తొలగింపు పనులు చేపట్టారు. దీంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.



రాజవరం వద్ద లోతట్టు ప్రాంతాలను పరిశీలించిన అధికారులు



తిమ్మాపురంలో నేలకొరిగిన పంట వద్ద దిగాలుగా రైతు



తిమ్మరాజుపేటలో కాలువల్లో వర్షపునీరు పోయేలా చర్యలు చేపడుతున్న దృశ్యం

తీర గ్రామాల్లో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ పర్యటన

ఎస్.రాయవరం : మిచాంగ్ తుపాను తీవ్రత తగ్గే వరకు పూరిగుడిసెల్లో నివసించేవారు పునరావాసా కేంద్రాల్లో ఉండాలని మండల ప్రత్యేకాధికారి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ మహేష్ సూచించారు. తీర ప్రాంత గ్రామాలైన బంగారమ్మపాలెం, రేవు పోలవరం గ్రామాల్లో మంగళవారం ఆయన పర్యటించారు. వర్షంలో తడుస్తూనే కొన్ని నివాసాలు సందర్శించి గ్రామస్తులకు సూచనలు చేశారు.

బంగారమ్మపాలెం పాఠశాలలోనూ, రేవుపోలవరం తుపాను కేంద్రంలోనూ పునరావాస కేంద్రం ఏర్పాటు చేస్తున్నట్టు చెప్పారు. కొరుప్రోలు గ్రామంలో ఎస్సీ కాలనీలో ప్రమాదకరంగా ఉన్న నివాసాల వారిని 30 మందిని పాఠశాల భవనం లోనికి తరలించి పునరావాసం కల్పించారు.

తుపాను తగ్గే వరకూ తహసీల్దార్ విజయ్‌కుమార్, డిప్యూటీ తహసీల్దార్ శ్యామ్‌కుమార్, ఎంపీడీవో రామచంద్రమూర్తి, ఈవోపీఆర్డీ సత్యనారాయణ, పంచాయతీ కార్యదర్శులు, వీఆర్వోలు అందుబాటులో ఉంటున్నట్టు చెప్పారు. తుపాను ప్రభావంతో రేవుపోలవరం తీరంలో కెరటాలు ముందుకు వచ్చి కొంత మేర సముద్రం గట్టు కోతకు గురయ్యింది. రెండు రోజులుగా అలల తీవ్రత ఎక్కువగా ఉండడం, సుమారు వంద మీటర్లు మేర సముద్రం ముందుకు రావడంతో గట్టు కోతకు గురైందని స్థానికులు తెలిపారు.



ఎస్.రాయవరం : వర్షంలో గ్రామంలో పర్యటిస్తున్న స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ మహేష్

యలమంచిలి జలమయం

- 24 గంటల్లో 6.8 సెం.మీ వర్షపాతం
- సహాయక చర్యల్లో అధికారులు
- హరిపాలెం రెగ్యులేటర్ వద్ద గేట్లను ఎత్తిన రైతులు
- 40 మి.మీ వర్షపాతం నమోదు



పరమేశ్వరీ థియేటర్ కూడలి వద్ద రహదారిపై చేరిన వర్షపు నీరు



భారీ వర్షంతో నిర్మానుష్యంగా రెల్వేస్టేషన్ రహదారి



యలమంచిలి-అచ్యుతాపురం రహదారిపై వర్షపు నీటిలో ప్రయాణిస్తున్న ఆటో

యలమంచిలి(అనకాపల్లి రూరల్): తుపాను కారణంగా పట్టణంలో భారీ వర్షం కురిసింది. దీంతో పల్లపు ప్రాంతాలు, ప్రధాన వీధులు జలమయమయ్యాయి. అల్లూరి సీతారామరాజు కాలనీ, ఫైర్ ఆఫీస్ కాలనీ, మిలట్రీ కాలనీ, రాంనగర్, శేషుకొండ కాలనీ, రామారాయుడుపాలెం, కొత్తపాలెం, పట్టణంలోని ప్రధాన రహదారి,అచ్యుతాపురం రోడ్డు, దిమిలి రోడ్డు దిగువ ప్రాంతాల్లో రహదారులపై భారీగా వర్షపునీరు చేరింది. ఎర్రవరం అండర్ బ్రిడ్జి వద్ద వర్షపు నీరు నిలిచిపోవడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. రైల్వే స్టేషన్ రోడ్డు కూడలి వద్ద చెట్టు కూలింది. పొక్లెయిన్ సాయంతో చెట్టును మున్సిపల్ సిబ్బంది తొలగించారు. రెవెన్యూ, మున్సిపల్ అధికారులు వరద ప్రభావిత ప్రాంతాలను గుర్తించి సిబ్బందితో ప్రజలను అప్రమత్తం చేశారు. తహసీల్దార్ రాణీ అమ్మాజీ, మున్సిపల్ కమిషనర్ కొండలరావు లోతట్టు ప్రాంతాల్లో పర్యటించారు. అవసరమైతే పునరావాస కేంద్రాలకు ప్రజలను తరలించడానికి అవసరమైన చర్యల గురించి ప్రణాళిక రూపొందించారు. తుపాను వర్షాలకు రోడ్డు పక్కన వ్యాపారాలు చేసుకునేవారంతా ఇళ్లకే పరిమితమయ్యారు. టీదుకాణాలు సైతం తెరుచుకోలేదు. ఫ్యాన్సీ దుకాణాల్లో గొడుగులు అధిక ధరలకు విక్రయించారు.

లక్కబొమ్మల కళాకారుల ఇళ్లలోకి చేరిన నీరు

యలమంచిలి : యలమంచిలి పట్టణంతో పాటు మండలంలో పలు గ్రామాల్లో ఏకధాటిగా వర్షం కురిసింది. ఏటికొప్పాక గ్రామంలో ఒక పెంకుటిల్లు కూలిపోయింది. లక్కబొమ్మల కళాకారుల కాలనీలో వర్షపు నీరు ఇళ్లలోకి రావడంతో కళాకారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఏటికొపాకలో వరహానది ఉధృతంగా ప్రవహిస్తుంది. శేషుగెడ్డ, మాల గెడ్డ నీటి ప్రవాహంతో పరవళ్లు తొక్కుతున్నాయి.

పూడిమడక, తంతడి గ్రామాల్లో అధికారుల పర్యటన

అచ్యుతాపురం(అనకాపల్లి) : అచ్యుతాపురంలో మంగళవారం ఉదయం ఎనిమిదిన్నర గంటల నుంచి మధ్యాహ్నం రెండున్నర గంటల వరకూ నలభై మిల్లీమీటర్ల వర్షపాతం నమోదయ్యింది. మండలంలోని తీర ప్రాంత గ్రామలైన పూడిమడక, తంతడి గ్రామాలపై అధికారులు దృష్టి సారించారు. ఆర్డీవో చిన్నికృష్ణ, తహసీల్దార్ శ్రీనివాస్, సీఐ మురళీరావు, ఎస్ఐ సన్యాసినాయుడు పూడిమడక తీరంలో పర్యటించారు. తంతడిలో ఆర్ఐ కుమార్‌తో పాటు పలువురు అధికారులు పర్యటించారు. తుపాన్ షెల్టర్లను ఏర్పాటు చేశారు. కొండకర్ల ఆవలో నీటి ఉధృతి పెరగడంతో హరిపాలెం-అందలాపల్లి ప్రధాన రెగ్యులేటర్ వద్ద గేట్లను ఎత్తివేశారు.

తీరంలో అలల ఉధృతి

రాంబిల్లి: తుపాను ధాటికి తీరప్రాంత గ్రామాల్లో తీరాల్లో ఉవ్వెత్తున సముద్రపు అలలు ఎగసిపడుతున్నాయి. దిమిలి, కట్టుబోలు, కుమ్మరాపల్లి, రజాల, మురకాడ, మామిడివాడ, పంచదార్ల, రాజుకోడూరు, మర్రిపాలెం గ్రామాల్లో వరిపంట నేలకొరిగింది. మండలంలో మొత్తం 3565 ఎకరాల్లో వరిపంటను రైతులు సాగు చేయగా మంగళవారం నాటికి 855 ఎకరాల్లో వరిపంట నేలకొరిగిందని ఏవో సుమంత తెలిపారు.

నేలకొరిగిన వరిచేలు

మునగపాక : మండల వ్యాప్తంగా రెండు రోజులుగా భారీ వర్షం కురిసింది. దీంతో పంట పొలాలు దెబ్బతిన్నాయి. అలాగే పలు కాలనీల్లో నీరు నిలిచిపోయింది. మండల సముదాయానికి వెళ్లే దారిలో రోడ్డుపై నీరు నిలిచిపోయింది. వ్యవసాయాధికారి జ్యోత్స్నకుమారి పలు ప్రాంతాల్లో పర్యటించి దెబ్బతిన్న వరి పైరును పరిశీలించారు. 16.8 మిల్లీమీటర్ల వర్షం కురిసినట్లు అధికారులు తెలిపారు.



అరబుపాలెంలో వరిపైరును పరిశీలిస్తున్న వ్యవసాయాధికారి జ్యోత్స్నకుమారి



హరిపాలెం రెగ్యులేటర్ గేట్లను ఎత్తుతున్న దృశ్యం



యలమంచిలి : ఏటికొప్పాకలో లక్కబొమ్మల తయారీ షాపుల్లోకి చేరిన వర్షపు నీరు



మురకాడలో రైతులకు సూచనలిస్తున్న ఏవో సుమంత

'ల్యాండ్ టైటిలింగ్ చట్టాన్ని రద్దు చేయాలి'

అనకాపల్లిటౌన్: ల్యాండ్ టైటిలింగ్ చట్టాన్ని రద్దు చేయాలని అనకాపల్లి బార్ అసోసియేషన్ సీనియర్ న్యాయవాది పి.బాలగంగాధర్ తిలక్ డిమాండ్ చేశారు. స్థానిక కోర్టు ఆవరణలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎస్ఎస్‌వీ లక్ష్మణరావు ఆధ్వర్యంలో న్యాయవాదులు మంగళవారం విధులు బహిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ల్యాండ్ టైటిలింగ్ చట్టం అమలు జరిగితే సామాన్య ప్రజలు తీవ్రంగా నష్టపోతారని ఆవేదన వ్యక్తం చేశారు. చట్టాన్ని రద్దు చేసేవరకూ విధుల బహిష్కరణ, రాష్ట్ర వ్యాప్తంగా నిరసనలు చేపడతామన్నారు. వివాదాలను పరిష్కరించే సివిల్ కోర్టు పరిధిని రద్దు చేసి రెవెన్యూ పరిధిలో పెట్టడం అన్యాయమన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ ఉపాధ్యక్షుడు బీవీ రమణ, ప్రధాన కార్యదర్శి ఎస్.శ్రీనివాస్, కోశాధికారి కె.సందీప్, సీనియర్ న్యాయవాదులు పీఎస్ పట్నాయక్, ఎం.జగపతి, కె.ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఓటరు నమోదు గడువు 9

అనకాపల్లిటౌన్: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో 18 ఏళ్లు నిండిన యువతీ, యువకులు ఓటు హక్కు నమోదుకు ఈ నెల 9లోపు దరఖాస్తు చేసుకోవాలని ఆర్డీవో ఏజే చిన్నికృష్ణ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎన్నికల కమిషనర్, ప్రభుత్వ ఆదేశాల మేరకు కొత్త ఓటర్ నమోదు, మార్పులు చేర్పులపై బీఎల్వోలతో విస్తృత ప్రచారం చేస్తున్నామన్నారు. వచ్చే ఏడాది జనవరి 5 తర్వాత పూర్తి ఓటర్ జాబితాను ప్రభుత్వం విడుదల చేయనుందన్నారు.